ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 20 డిసెంబరు 2024 | 5



వీధివారిలంక వద్ద గోదావరిని ఆనుకుని మట్టితవ్విన దృశ్యం

తవ్వేస్తున్నారు..

కేదార్లంక వద్ద బట్టీలను ఆనుకుని గోదావరి నదీ కోతకు గురైన భూములు



లంక గ్రామాల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

నదీ కోతకు గురవుతున్న పొలాలు



కేదార్లంక వద్ద బట్టీలను ఆనుకుని గోదావరి నదీ కోతకు గురైన భూములు



వీధివారిలంక శివారులో మందపల్లి పొలిమేరలో అక్రమంగా తవ్వేసి మట్టి తరలించిన దృశ్యం

కపిలేశ్వరపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురం మండలంలోని లంకగ్రామాలైన కేదార్లంక, వీధివారిలంక గ్రామాల పరిధిలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నదీ ప్రాంతాన్ని సైతం వదలకుండా సుమారు 10 నుంచి 15 అడుగుల లోతు వరకూ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఇంతవరకూ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. మట్టి తవ్వకాల కారణంగా లక్షలాది రూపాయలు విలువైన పంట భూములు గోదావరి వరదల సమయంలో నదీకోతకు గురై నదిలో కలిసిపోతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఇటుక బట్టీలు అధికంగా ఉండడంతో వీటి నిర్వహణ కోసం రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తవ్వి బట్టీల వద్ద నిల్వ చేస్తుండగా కొంతమట్టిని బయటకు విక్రయిస్తూ బడాబాబులు సొమ్ములు చేసుకుంటున్నారు. కొంతమంది బట్టీ నిర్వాహకులు ఎవరికి వారే యథేచ్ఛగా మట్టిని బట్టీలకు తరలించుకుపోతున్నారు. వాల్టా చట్టం ప్రకారం పొలాల్లో మట్టి తవ్వకాలకు రెవెన్యూ, మైన్స్ శాఖల అనుమతి పొందాల్సి ఉండగా అదేమి పట్టించుకోకుండా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కేదార్లంక, వీధివారిలంక పరిధిలోని అరటితోటల్లో నుంచి పర్మిషన్ లేకుండా బాట వేసి మందపల్లి పొలిమేరకు సంబంధించిన భూమిలోనుంచి అక్రమంగా మట్టిని తవ్వి బట్టీలకు తరలించుకుపోతున్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. అక్రమ మట్టి దందాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మట్టి మాఫియాతో కుమ్మక్కై పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వకం కారణంగా గ్రామంలోని సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని దీనికి సమాధానం ఎవరు చెబుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను ఆపి రైతులకు, గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియను

పారదర్శకంగా నిర్వహించాలి

అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగానికి జవసత్వాలు నింపే విధంగా డిమాండ్‌కు అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కమిటీ సభ్యులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఎనిమిది రీచ్‌లలో మనుషుల ద్వారా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారన్నారు. వీటిలో పులిదిండి, ఆత్రేయపురం, వద్దిపర్రు-2, ఊబలంక, పొడగట్లపల్లి, అంకంపాలెం-2, నార్కేడుమిల్లి, కపిలేశ్వరపురం ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. టెండర్ల ద్వారా ఇసుక తవ్వకాలు కోసం నియమించిన ఏజెన్సీలు వర్కు ఆర్డరు ఇచ్చిన మూడు రోజుల్లో తప్పనిసరిగా తవ్వకాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టాకు యార్డులకు ఇసుకను తరలించి అందుబాటులో ఉంచుతూ యథావిధిగా విక్రయాలు కొనసాగించాలన్నారు. సహజ వనరుల వెలికితీత వినియోగంలో గనులు, భూగర్భశాఖ పాత్ర కీలకమన్నారు. భవన నిర్మాణ రంగానికి ఊతం ఇచ్చే విధంగా ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అనుమతించిన ఇసుక రీచ్‌ల నుంచి పూర్తిస్థాయిలో తవ్వకాలు నిర్వహిస్తూ సరఫరా చర్యలు చేపట్టాలన్నారు. ఉచిత ఇసుకను తీసుకువెళ్లి ఎవరైనా నిల్వచేసి విక్రయిస్తున్నట్టు గుర్తిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల పరిధిలో వ్యక్తిగత అవసరాలకు, సమూహ నిర్మాణ పనుల కోసం వినియోగదారులు ఇసుకను ఎడ్ల బండి, ట్రాక్టరు ద్వారా, మనుషుల ద్వారా తరలించుకోవాలన్నారు. జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నట్టయితే కేసులు బనాయించి చర్యలు చేపట్టాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేయాలని, అదేవిధంగా కంట్రోల్ రూము నుంచి నిరంతర పర్యవేక్షణ చేపట్టి అక్రమ ఇసుక రవాణాను పూర్తిస్థాయిలో నిరోధించాలన్నారు. ఉచిత ఇసుక సరఫరాలో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతీ ఏజెన్సీ రోజుకు కనీసం 500 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు నిర్వహించాలని, అంతకన్నా తక్కువస్థాయిలో తవ్వకాలు నిర్వహిస్తే ఏజెన్సీని రద్దు చేస్తామన్నారు. నూతనంగా వశిష్ఠ, గౌతమి నదుల్లో ఏడు రీచ్‌లను గుర్తించామన్నారు. వాటిలో పేరవరం, వెలిచేరు, రాజవరం, గోపాలపురం-1,-2, మెర్లపాలెం, తాడిపూడి రీచ్‌లు ఉన్నాయన్నారు. పట్టాభూములు, ఇసుక తవ్వకాలకు సంబంధించి పట్టాదారుని ద్వారా దరఖాస్తులు స్వీకరించి సర్వే, ఇతర అనుమతుల కోసం చర్యలు చేపట్టాలన్నారు. నూతనంగా ప్రతిపాదించిన రీచ్‌లకు నదీ సంరక్షణాధికారి అనుమతి, డీజీపీఎస్ సర్వే, మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతులు త్వరితగతిన వచ్చే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రవాణా చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తున్నారనే అభియోగాలు ఇకపై ఉత్పన్నం కాకుండా కమిటీ నిర్దేశించిన ధరలు నిర్దిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావును ఆదేశించారు. సమయ పాలన, రవాణాలో జాప్యాన్ని నిరోధించేందుకు ప్రతీ స్టాకు యార్డులో కనీసం రెండు జేసీబీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గోదావరి నదిలో వంతెనలు, ఇతర నిర్మాణాలు, కట్టడాలు ఉన్నచోట వాటికి 500 మీటర్ల పరిధిలో ఎటువంటి తవ్వకాలు నిర్వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా గనులు, భూగర్భ శాఖ ఏడీ ఎల్.వంశీధర్‌రెడ్డి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీపీవో డి.శాంతలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ విజయ్, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా వర్షాలు

అన్నదాతల ఆందోళన

అమలాపురం , డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గురువారం కోనసీమ జిల్లా వ్యాప్తంగా చెదురుమదురుగా వర్షాలు పడ్డాయి. చలిగాలులు కూడా ఎక్కువ ఉండడంతో ప్రజలు పెద్దగా రోడ్లపైకి రాలేదు. పూర్తిగా వాతావరణం చీకటి మయంగా మారిపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం వల్ల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వరి సేద్యం చేసుకుంటున్న రైతులకు ఇబ్బందికరంగా మారింది. కొన్నిచోట్ల ధాన్యం రాశులను సంరక్షించుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. రాగల రెండు, మూడు రోజుల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దాళ్వా సేద్యం ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు అన్నదాతలకు నష్టం కలుగుతుంది. కొన్ని ప్రాంతాల్లో ఇసుక ర్యాంపుల్లో వాహనాల రాకపోకలకు అవరోధం కూడా ఏర్పడింది. మరోవైపు అల్పపీడనం కారణంగా బంగాళాఖాతం తీరం అంతర్వేది నుంచి యానాం వరకు అల్లకల్లోలంగా మారింది. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడడంతో పాటు తీర ప్రాంతాన్ని కోతకు గురి చేస్తున్నాయి. మత్స్యకారులు సముద్రం, గోదావరిలోకి వేటకు వెళ్లకుండా బోట్లను జట్టీల వద్దే లంగర్లు వేశారు.



ప్రత్యేక కథనం 6లో

మహా కుంభమేళాకు వెళ్లిరండిలా..

ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనానికి భారత్ గౌరవ్ రైళ్లు



వర్గీకరణ వద్దు : కాకినాడలో మాలల నిరసన ప్రదర్శన



వర్గీకరణ ముద్దు : మాదిగ ఉపకులాల నినాదాలు

వర్గీకరణం

2468 మంది హాజరు.. 311 వినతులు

కాకినాడలో ప్రజాభిప్రాయ సేకరణకు ఉమ్మడి జిల్లా నుంచి

- ఎస్సీ వర్గీకరణపై ఉపకులాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ
- కాకినాడ విచ్చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- వర్గీకరణకు అనుకూలంగా.. వ్యతిరేకంగా మోహరించిన ఇరువర్గాలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ గురువారం కాకినాడలో ప్రజాభిప్రాయసేకరణ చేశారు.దీనికిగాను ఆయన కాకినాడ కలెక్టరేట్‌కు విచ్చేశారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి విచ్చేసిన మాల, మాదిగ, రెల్లి,బుడగ జంగాల వంటి ఎస్సీ ఉపకులాల వారితో కలెక్టరేట్ కిక్కిరిసింది. పోటాపోటీ నిరసనలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఎస్సీ ఉపకులాలకు సంబంధించి వర్గీకరణపై ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు నియమించిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా వినతులు స్వీకరించారు. ఆయా కులాల నాయకులు,ప్రజలు పోటాపోటీగా ధర్నాలు, నిరసనలు చేశారు. ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా ఉమ్మడి ఏపీలో 1997లో రామచంద్ర రాజు కమిషన్ వేశారని మాదిగ సంఘాలు గుర్తుచేశారు. ఆ కమిషన్ రిపోర్టు ప్రకారం 2000 నుంచి 2004 వరకు ఉమ్మడి ఏపీలో వర్గీకరణ అమలు జరిగిందని ఆయా సంఘాలు పేర్కొన్నాయి. ఉషామెహ్రా కమిషన్ 2008లో ఎస్సీ వర్గీకరణ అవసరమని ప్రకటించారని మాదిగ సంఘాలు తెలిపారు.

7



కాకినాడలో వినతులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

వ్యతిరేకంగా నిరసనలు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు, మాలసంఘాలు నిరసనలు తెలిపాయి. వన్ మ్యాన్ కమిషన్ గోబ్యాక్ అంటూ మాలలు నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. 1972 గణాంకాల ప్రకారం మాలలకు రిజర్వేషన్లు కేటాయించాలని అనుకోవడం సరైనది కాదని వారు అభ్యంతరాలు తెలిపారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్ విష్ణు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఇంద్రపాలెం వంతెన వరకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ఒక బ్రాండుపైనే రైతుల మోజు

హైబ్రిడ్ విత్తనాల కోసం ఆరాటం

మొలక శాతంపై లభించని హామీ

ఎంటీయూ-1121 మేలంటున్న వ్యవసాయ శాఖ

దాళ్వా విత్తనాల ఎంపికలో సందిగ్ధత

ఉప్పలగుప్తం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దాళ్వా విత్తన ఎంపికలో రైతులు సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వ్యవసాయశాఖ సిఫారసు చేసిన ఎంటీయూ-1121 రకంపై రైతులు అంతగా ఆసక్తి చూపించడం లేదు. ఈ రకం ఎకరా దిగుబడి 40-45 బస్తాలకు మించి ఉండకపోవడమే కారణం. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నేల స్వభావం వల్ల కుళ్ల తెగులు సోకడంతో ఈ రకం సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. అదే హైబ్రిడ్ రకాలు ప్రధానంగా బొండాల వంటి రకాలైతే 50 నుంచి 60 బస్తాల వరకు దిగుబడి తథ్యమన్న నమ్మకంతో విత్తనాల కోసం ఎగబడుతున్నారు. ఎంసీ-13 రకం బొండాలతో అధిక దిగుబడులు సాధించిన నేపథ్యంలో అదే బ్రాండు కోసం మార్కెట్‌లో అన్వేషణ సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎంసీ-13 రకం మొలక శాతం 50 నుంచి 60 శాతం వరకు మాత్రమే డీలర్లు భరోసా ఇస్తున్నారు. దీంతో రైతుల్లో అయోమయం నెలకొంది. మొలక శాతంపై అనుమానం, మరో రకాన్ని ఎంచుకోలేని గందరగోళ స్థితిలో రైతులున్నారు. అందుబాటులో ఉన్న బయోసీడ్‌తో పాటు ఇతర బొండాలు రకాల మొలకశాతం, ఎకరా దిగుబడులపై డీలర్లు హామీ ఇస్తున్నప్పటికీ రైతులు మక్కువ చూపడం లేదు. గత అనుభవాల దృష్ట్యా ఎంసీ-13 రకాన్నే సాగు చేయాలన్నది రైతుల ఆకాంక్ష. ఈ పరిస్థితిలో వ్యాపారులు హైబ్రీడ్ విత్తనాల విక్రయాలను విరమించుకున్నారు. దీంతో హైబ్రీడ్ రకాలు మార్కెట్‌లో దొరకడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొలక శాతం తగ్గిన ఎంసీ-13 మినహా ఏ ఇతర బొండాల రకాలైనా సరఫరా చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు. కాగా ఎంటీయూ-1121 రకం దాళ్వాకు ఎంతో అనువైనదని, ధాన్యాన్ని సులభంగా మార్కెట్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అనుకూల వాతావరణం కారణంగా జాప్యమవుతున్న వరినారు మళ్లు, విత్తనాల కారణంగా మరింత వెనుకబడే ప్రమాదముందని రైతులు భయపడుతున్నారు.

ఎంటీయూ-1121 అనుకూల రకం

జిల్లా వ్యవసాయాధికారి, వి.బోసుబాబు

జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగుకు అవకాశమున్నట్టు జిల్లా వ్యవసాయశాఖాధికారి వి.బోసుబాబు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 390 ఎకరాల విస్తీర్ణంలో నారుమళ్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో ఎంటీయూ-1121 రకం ఎకరాకు 50 బస్తాల వరకు దిగుబడి ఉంటుందన్నారు. హైబ్రిడ్ రకాల కంటే బస్తాకు ఎక్కువ ధర లభిస్తుందన్నారు. దరఖాస్తు చేసుకుంటే ఎంటీయూ-1121 విత్తనాలను రాయితీపై ఇచ్చేందుకు వీలుంటుందన్నారు.

భూముల మార్కెట్ విలువల సవరణకు చర్యలు

జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భూముల మార్కెట్ విలువలు సవరించడానికి చర్యలు చేపట్టినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం డీఐజీ రిజిస్టర్, జిల్లా రిజిస్ట్రార్, సబ్‌రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. భూముల మార్కెట్ విలువల సవరణకు సంబంధించి విధివిధానాలపై సమీక్షించారు. జిల్లా రిజిస్ట్రార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సవరించిన భూ మార్కెట్ విలువల ముసాయిదా జాబితాలను ప్రదర్శించామన్నారు. అదే విధంగా వెబ్‌సైట్‌లో ముసాయిదా జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. వీటిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందించాలన్నారు. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది జాబితాను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించనున్నట్లు చెప్పారు. భూమి మార్కెట్ విలువలు 2025 జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయని స్పష్టం చేశారు. సమావేశంలో డీఐజీ రిజిస్ట్రార్ బి.శివరామ్, జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, డీఎల్డీవో ఎస్.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల దినోత్సవం సన్నద్ధతపై సమీక్ష



జేసీని కలుసుకున్న వినియోగదారుల సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న జరిగే జాతీయ వినియోగదారుల దినోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పౌరసరఫరాల సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల సిబ్బందితో గురువారం కలెక్టరేట్‌లో వినియోగదారుల దినోత్సవ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, ఆహార భద్రతా శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. వినియోగదారుల హక్కులకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. డిజిటల్ ప్రపంచంలో వినియోగదారులు ప్రకటనలతో మోసపోతున్నారని, ప్రతీఒక్కరూ తమ హక్కుల పట్ల చైతన్యవంతులయ్యే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉదయభాస్కర్, జిల్లా మేనేజర్ బాలసరస్వతి, సహాయ అధికారి శరత్, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి, అమరేశ్వరరావు, శ్రీనివాస్, బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నెన్నో అందాలు.. 6లో




ఉడ్..దౌడ్!

సిమెంటు గుమ్మాలే ముద్దు

పెరిగిన వినియోగం - వ్యయ తగ్గింపులో భాగం

కలపకు ప్రత్యామ్నాయంగా వాడుక




పెరవలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేటు దూప్లికేటు అన్నట్టు.. ప్రతి దానికి ప్రత్యామ్నాయం వచ్చేసింది..ఇదీ అటు వంటిదే.. పూర్వం ఇంటి నిర్మాణంలో గుమ్మాలు, కిటీలకు కలపనే వాడేవారు.. ప్రస్తుతం నాణ్యత కలిగిన కలప దొరకడమే గగనంగా మారింది..పోనీ కలప కొందామని వెళ్లినా గుమ్మాలు.. కిటికీలకే లక్షలు పోయాల్సిందే. అదే సిమెంట్ గుమ్మా లైతే వేలల్లో తేలిపోతోంది. రేటు తక్కువగా ఉండడం, దీర్ఘకాలం చెదలు పట్టకుండా ఉండ డం వంటి కారణాలతో ప్రస్తుతం ప్రతి ఒక్కరి చూపు అటు వైపే ఉంటుంది. కొంత మంది ప్రధాన సింహ ద్వారానికి టేకు,లేదా వేప లేదా ఇతర రకాల కలపతో తయారైన గుమ్మాలను పెట్టి మిగిలిన వాటిని సిమెంటు గుమ్మా లు అమర్చుతున్నారు.వాటికి తలుపులు ప్లైవుడ్ గాని,ఫైబర్ గాని తో తయారైన వాటిని బిగిస్తున్నారు. దీని వల్ల ఖర్చు ఆదా అవుతుందనేది గృహ నిర్మాణదారుల మాట. కలప గుమ్మాలు, కిటికీలు తయారు చేయించి అమర్చాలంటే లక్షలాది రూపాయలు వ్యయం చేయాల్సి వస్తుంది. ఖర్చును తగ్గించుకోవడం కోసం సిమెంటు గుమ్మాలు వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో సిమెంటు గుమ్మాలు,కిటికీల తయారీ పరిశ్రమలు పెరిగాయి. తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో నాలుగైదేళ్లలో మూడు పరిశ్రమలు వెలిశాయంటే ఎంతగా డిమాండ్ వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. సిమెంటు గుమ్మం ఖరీదు సైజును బట్టి రూ.800 నుంచి రూ.1000 వరకు పలుకుతుండగా అదే కలపతో తయారు చేసిన గుమ్మం రూ.5 వేల నుంచి రూ.10 వేలు పలుకుతుంది. కిటికి సైజును బట్టి రూ.1000 నుంచి రూ.3 వేల వరకు ,సిమెంటు కిటికీలు ఉండగా కలపతో చేసినవి రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు ఉంటు న్నాయి. సాధారణ రకాలైతే ఇలా..మద్ది,టేకు.. ఎర్రచందనం తదితర రకాల కలపైతే ధర ఊహించలేం. దీంతో ఎక్కువ మంది సిమెంటు గుమ్మాలను పెట్టుకుంటున్నారు. కిటికీలకు ఐరన్ వాడుతున్నారు. వాటికి ఉడ్‌లా కనిపించేలా రంగులు వేస్తున్నారు.



రెండు మూడేళ్లగా వినియోగం పెరిగింది



సుమారు ఐదేళ్ల కిందట పెరవలిలో సిమెంటు గుమ్మాలు, కిటికీలు తయారీ పరిశ్రమ పెట్టా. గత రెండు మూడేళ్లగా వీటికి డిమాండ్ పెరిగింది. కర్ర గుమ్మాలతో పోలిస్తే వీటికి ఖర్చు తక్కువ.దీంతో చాలా మంది మక్కువ చూపుతున్నారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం.

- కలిదిండి శ్రీనివాస్, తయారీదారుడు, పెరవలి

కొంగల గుంపు.. సందడి..



కొంగలు గుంపులు.. గుంపులుగా సందడి చేశాయి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలోని ఒక పంట పొలంలో కొంగలు ఇలా సందడి చేశాయి. ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా వందలాది కొంగలు రైతులకు మేలు చేకూర్చేలా పొలంలోని పురుగులను తిన్నాయి. ఈ దృశ్యం కనువిందు చేసింది.

-ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి)



మహాకుంభమేళాకు.. వెళ్లిరండిలా!

- ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనానికి భారత్ గౌరవ్ రైళ్లు
- మహాకుంభమేళా వీక్షణకు వచ్చేనెలలో 'మహా కుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర' పేరిట ప్రత్యేక రైలు
- కాశీ, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ దర్శించుకునే అవకాశం
- వచ్చేనెల 19న సికింద్రాబాద్‌లో మొదలై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా ప్రయాణం
- రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని రైల్వేస్టేషన్లలో హాల్టు
- మొత్తం 8రోజులపాటు ప్రయాణం

ఆంధ్రజ్యోతి/సామర్లకోట

మహాకుంభమేళా చూడాలనుకుంటున్నారా? లక్షలమంది జనం.. భక్తితత్వంతో కూడిన భగవన్నామ స్మరణ.. అలాంటి దృశ్యం చూస్తేనే అద్భుతం.. అమోఘం.. దీన్ని కనులారా చూడాలనుకుంటే ఈ కథనంలోకి పదండి..

దేశంలో వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు భారత్ గౌరవ్ రైళ్లను భారత రైల్వే ఆధ్వర్యంలో ఐఆర్‌సీటీసీ నడుపుతోంది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిల్లో జరిగే కుంభ మేళాను వీక్షించేందుకు పలు రైళ్లను 'మహా కుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర' పేరిట నడుపుతున్నారు. వీటిలో భాగంగా ఒక రైలు సికింద్రాబాద్ నుంచి వచ్చేనెల 19న బయలుదేరనుంది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నుంచి ఈ భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా ప్రయాణించనుంది. దీనికి రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని హాల్ట్‌లు కేటాయించారు.

దేశవ్యాప్తంగా పలు రైళ్లు

వచ్చేనెల 19న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనున్న ఈ రైలు 8రోజుల తర్వాత తిరిగి అదే రైల్వేస్టేషన్‌కు చేరుకోనుంది. ఈ ప్రత్యేక భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మహాకుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర పేరిట నామకరణం చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుస్తు న్న ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఉత్త ర్‌ప్రదేశ్‌లోని వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లనుంది. దీనికి సంబం ధించి ప్రయాణ ప్యాకేజీని ఇదివరకే రైల్వే అధికారులు ప్రకటించారు. ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొ రేషన్(ఐఆర్‌సీటీసీ) నుంచి మంచి ఆదరణ లభించినట్లు అధికారులు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 576 సీట్లు బుక్ చేసు కునే అవకాశం కల్పించారు. దేశంలో ప్రఖ్యాత పుణ్య క్షేత్రాలను అనుసంధానిస్తూ రైల్వే మం త్రిత్వ శాఖ భారత్‌గౌరవ్ పేరిట ఈ తరహా ప్ర త్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటికి ప్రయా ణికుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్‌నుంచి అయోధ్య, వారణాసికి ఈ ఎక్స్‌ప్రెస్ రైలును అందుబాటులోకి తీసుకువచ్చింది. 7 రాత్రిళ్లు, 8 పగళ్లు ఈ రైలు ప్రయాణం సా గనుంది. ఈ తరహాలోనే పూణే, తిరునేల్‌వేలి, ఇండోర్, పూరీ, పుదుచ్చేరి, రాజ్‌కోట్, కోయంబ త్తూర్, కోల్‌కత్తా, ఉదయ్‌పూర్, జయసల్‌మేర్‌లనుంచి మహాకుంభ్‌మేళా పుణ్యక్షేత్ర యాత్ర పేరిట ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్‌లో వచ్చేనెల 19న మొదలయ్యే ఈ రైలు తెలంగాణలోని భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిరతోపాటు ఏపీలోని విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో హాల్ట్ సదుపాయం ఉంది. ప్యాకేజీలో వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షిదేవి ఆలయాన్ని సందర్శించవచ్చు. అయోధ్యలో శ్రీరామచంద్రుల వారి ఆలయం, హనుమాన్ గర్హి, హారతి, అత్యంత ప్రాచీనమైన సరయూ నదిని దర్శించవచ్చు. ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణీ సంగమం సందర్శనతో ఈ ప్యాకేజీ ముగుస్తుంది. ప్రయాగ్‌రాజ్ నుంచి మళ్లీ అయా హాల్ట్‌లతో పాటు చివరిగా సికింద్రాబాద్ చేరుకుంటుంది.



ఈ రైలు టిక్కెట్ ధరలిలా..

స్లీపర్.. పెద్దవారికి	- రూ.22,635
పిల్లల(5-11ఏళ్లు)కు	- రూ.21,740
థర్డ్ ఏసీ.. పెద్దలకు	- రూ.31,145
పిల్లలకు	- రూ.30,095
సెకండ్ ఏసీ.. పెద్దలకు	- రూ.38,195
పిల్లలకు	- రూ.36,935

ఈ రైలు వచ్చే ఏడాది.. అనగా 2025, జనవరి 19న సికింద్రాబాద్‌నుంచి బయలుదేరనుంది. దీనికి 576 సీట్లు రిజర్వేషన్‌కు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం సెకండ్ ఏసీలో టిక్కెట్ల బుకింగ్ క్లోజ్ అయింది. థర్డ్‌ఏసీ, స్లీపర్‌లో బుకింగ్‌కి అవకాశం ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లో 17 హాల్ట్‌లు ఇవ్వగా వాటిలో మన జిల్లాలో రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని నుంచి బుక్ చేసుకునే అవకాశం ఉంది.

ఉత్కంఠభరితంగా..

బాక్సింగ్ పోటీలు

- పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం
- తరలివచ్చిన 150మంది బాక్సర్లు



పిఠాపురంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పోటీపడుతున్న బాక్సర్లు

పిఠాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్ బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 8వ రాష్ట్రస్థాయి పురుషుల బాక్సింగ్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 150మంది బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాక్సర్ల మధ్య పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బీపీ లక్ష్మణదేవ్, కోశాధికారి శ్రీనివాసరావు, టెక్నికల్ కమిటీ చైర్మన్ డి.నాగేశ్వరరావులు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీలను ప్రేక్షకులు తిలకించేందుకు తరలివచ్చారు. కార్యక్రమాల్లో ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. లక్ష్మణరావు పర్యవేక్షించగా, మునిసిపల్ కోఆప్షన్ సభ్యు డు గండేపల్లి బాబీ, కొత్తప ల్లి బుజ్జి, ప్రభుత్వ జూనియ ర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కోశాధికారి నవీన్ పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరింది వీరే..

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో రౌండ్ల వారీగా పోటీల అనంతరం సెమీఫైనల్‌కు 47.5 కిలోలవిభాగంలో పి.పవన్(విశాఖజిల్లా), ఎస్.రాంబాబు(కాకినాడ), వై.ప్రభుదాస్(తిరుపతి), ఎం.జయంత్ సాయిస్వరూప్(మన్యం), 50-55 కిలోల విభాగంలో బాలగణేష్‌రెడ్డి(కడప), పి.ప్రసాద్(అనంతపురం), సూర్యదేవేందర్(నంద్యాల), జ్ఞానేశ్వర్(శ్రీకాకుళం), 55-60 కిలోల విభాగంలో డి.సందీప్(విశాఖ), ఎస్కే బాజీబాబా(ఎన్టీఆర్‌జిల్లా), పి.దిగ్విజయ్(కడప), పి.అప్పలరాజు(శ్రీకాకుళం), 60-65కిలోల విభాగంలో పి.విశ్వేశ్వరరావు(శ్రీకాకుళం), జయసాయితరుణ్(నెల్లూరు), ఎన్.సతీష్(పశ్చిమగోదావరి), భానుప్రకాష్(విశాఖ) చేరుకున్నారు. మిగిలిన విభాగాల్లో పోటీలు కొనసాగుతున్నాయి.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జనసేన పిఠాపురం ఇన్‌చార్జి శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు

అన్నవరంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.వి.తమిళసెల్వీ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అధికారులు పెన్నాడ వెంకటేశ్వరరావు, గణపతిలు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



వేదాశీర్వచనం పొందుతున్న తమిళసెల్వీ

ఎన్నెన్నో అందాలు!

- మోతుగూడెంలో ఆకట్టుకుంటున్న ప్రకృతి రమణీయ దృశ్యాలు



చింతూరు మండలం మోతుగూడెంలో పొల్లూరు జలపాతం



మోతుగూడెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో ఎన్నెన్నో అందాలు.. అన్నింటా కట్టి పడేసే చూడచక్కని ప్రదేశాలు.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీప్రాంతమైన చింతూరు మండలం మోతుగూడెం, డొంకరాయిల్లో ప్రకృతి రమణీయ దృశ్యాలు పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. ఈ అందాలను స్వయంగా చూస్తేనే మనం మంచి అనుభూతి పొందగలం. చింతూరు మండలం మోతుగూడెం, వై.రామవరం మండలం డొంకరాయి పచ్చని కొండలు.. వాటినుంచి జాలువారే జలపాతాలు.. అదే ప్రాంతాల్లోని జలవిద్యుత్ కేంద్రాలు, వాటి రిజర్వాయర్లు, ప్రాజెక్టు ప్రదేశాల్లోని జలప్రదేశాలు పర్యాటకులకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయి. అక్కడ గిరిజన గ్రామాలు పచ్చని పంట చేల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. ప్రస్తుతం శీతాకాలం కావడంతో వీటిని సందర్శించడానికి మంచి సీజన్. నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఇక్కడి అందాలను చూసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడ అందాలపై ఎన్నో సినిమాలు కూడా తీశారు. ఇటీవల సంచలనం సృష్టించిన పుష్ప-1, పుష్ప-2 చిత్రాలు ఇక్కడే చిత్రీకరించారు. వారాంతాల్లో ఇక్కడ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కానీ జలపాతాల వద్ద మాత్రం జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.



సీలేరు నదిలో పుష్ప చిత్రం షూటింగ్ జరిగిన ప్రదేశం



చింతూరు మండలం పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం



పెద్దపులి ఎక్కడ?

- ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీలో వీడని భయాందోళన



ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో పులి పాదముద్రలు(ఫైల్)

ప్రత్తిపాడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలో పెద్దపులి సంచారం స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో ఇటీవల సంచరించిన పెద్దపులి ఏమైందనేది ప్రశ్నార్థకంగా మారింది. 15రోజులక్రితం బురదకోట అటవీప్రాంతంలోని బాపన్నదార వద్ద లేగదూడను పెద్దపులి చంపి కొద్దిపాటి మాంసాన్ని తినడం ఆ ప్రాంతంలో సంచరించడం, పులి పాదముద్రలను అటవీశాఖాధికారులు గుర్తించడం వంటివి తెలిసిందే. పెద్దపులి ప్రస్తుతం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. పులిజాడ ఆచూకీ ఒకవైపు తెలియకపోవడం, మరోవైపు మళ్లీ సబ్‌ప్లాన్ ఏజెన్సీ అటవీప్రాంతంలోకి వస్తుందేమోనని స్థానికుల్లో భయాందోళన వీడలేదు. పెద్దపులి మళ్లీ రావచ్చనే అభిప్రాయంతో అటవీశాఖాధికారులు బురదకోట అటవీప్రాంతంలో ఆరు ట్రాప్ కెమెరాలు పెట్టారు. రెండు వారాలు గడుస్తున్నా అవి ఇంకా ఉంచారు. దీంతో పులి మళ్లీ బురద కోట అటవీప్రాంతంతోపాటు సబ్‌ప్లాన్ ఏజెన్సీ అటవీప్రాంతంలో సంచరించవచ్చనే భయాందోళనలో సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులను వెంటాడుతున్నాయి.

అడ్డతీగల అటవీప్రాంతం వైపే..

బురదకోట అటవీప్రాంత సమీపంలో ఉన్న రాజవొమ్మంగి అటవీప్రాంతంలో ఆరు రోజుల కిందట పెద్దపులి సంచరించడాన్ని చూసిన ఓ వ్యక్తి స్పృహ కోల్పోయి ఆస్పత్రిలో చేరారు. దీంతో పులి ఆ అటవీప్రాంతంలో ఉందనడానికి బలం చేకూరింది. ప్రస్తుతం పెద్దపులి రాజవొమ్మంగి అటవీప్రాంతం గుండా అడ్డతీగల అటవీ ఫారెస్ట్‌లోకి వెళ్లినట్లు అటవీశాఖాధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీ, రాజవొమ్మంగి అడ్డతీగల అటవీ ప్రాంతం కలిసి ఉండడంవల్ల ఈ ఫారెస్ట్‌లోనే పులి తిష్ట వేసినట్లుగా పలువురు భావిస్తున్నారు. పెద్దపులి సంచారంపై ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ దుర్గారాం ప్రసాద్‌ను వివరణ కోరగా అడ్డతీగల అటవీప్రాంతం వైపు వెళ్లినట్లు సమాచారం ఉందని, బురదకోట అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలు ఇంకా తొలగించలేదని స్పష్టం చేశారు.

బలిఘట్టం సత్యదేవుడి ఆలయం పరిశీలన

- స్థానిక అధికారులతో కలిసి పర్యటించిన అన్నవరం ఈవో

అన్నవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా బలిఘట్టం సత్యదేవుడి ఆలయాన్ని అన్నవరం ఈవో ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు అక్కడి దేవస్థానం అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా ఈనెల 6న అన్నవరం దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకుంది. ఈ నేపథ్యంలో అక్కడి ఆలయంతోపాటు ఆలయ ఆధీనంలో ఉన్న భూముల రికార్డులు, ఇతర వివరాలను అన్నవరం ఈవో సుబ్బారావు తెలుసుకున్నారు. అక్కడ ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఉపకమిషనర్ చంద్రశేఖర్, పీఆర్వో కొండలరావు, సూపరింటెండెంట్ రమణ పాల్గొన్నారు.

టమోటా.. కిలో రూ.5



- నేల చూపులు చూస్తున్న టమోటా
- అయోమయంలో రైతులు

గండేపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): టమోటా ధర పెరుగుతూ తగ్గుతూ రైతులను నష్టాల్లోకి నెట్టేస్తోంది. ఒకానొక సమయంలో కిలో రూ.200 పలికిన కిలో టమోటా ధర ఇప్పుడు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ మధ్యకాలంలో కిలో రూ.20 ఉన్న ధర ఒక్కసారిగా రూ.5కు పడిపోవడంతో వారంతా అయోమయంలో పడ్డారు. కోత కూలీ కూడా రాక ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో నష్టాలు ఎదుర్కొంటున్నారు. మదనపల్లి నుంచి లోకల్ మార్కెట్‌లకు సరుకు భారీగా దిగుమతులు కావడంతో ఇక్కడ పండించిన టమోటా ధర పడిపోతోందని వ్యాపారులు అంటున్నారు. రిటైల్ వ్యాపారస్తులు హోల్‌సేల్ మార్కెట్‌లో తక్కువకు కొని వినియోగదారులకు రూ.5నుంచి రూ.10 మధ్య విక్రయాలు చేస్తున్నారు.

ట్యాంకర్ నుంచి యాసిడ్ లీకేజీ

- పోలీసులు అప్రమత్తం.. తప్పిన ప్రమాదం
- అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



రాజానగరం సమీపంలో హైవేపై పడిన యాసిడ్‌ను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజానగరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్‌వద్ద గురువారం తెల్లవారుజామున ప్రయాణిస్తున్న ట్యాంకర్‌నుంచి యాసిడ్ (హెచ్‌సీఎల్) లీక్ అవడంతో ప్రయాణికులు ఆందోళనకు లోనయ్యారు. విశాఖ నుంచి యాసిడ్ ట్యాంకర్ దేవరపల్లి బయలుదేరింది. మార్గమధ్యలో జీఎస్ఎల్ సమీపానికి వచ్చేసరికి ట్యాంకర్ నుంచి యాసిడ్(హెచ్‌సీఎల్) లీకై హైవేపై పడి పొగలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు ట్యాంకర్ డ్రైవర్‌ను సూచించడంతో డ్రైవర్ తక్షణమే ట్యాంకర్‌ను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న రాజానగరం పోలీసులు, హైవే పెట్రోలింగ్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజమహేంద్రవరం, కోరుకొండనుంచి అగ్నిమాపకయంత్ర సిబ్బంది సకాలంలో సంఘటనాస్థలానికి చేరుకుని యంత్రాల సహాయంతో పొగలు వ్యాప్తిచెందకుండా ఉండేలా ట్యాంకర్‌నుంచి యాసిడ్ లీకేజీ కాకుండా అరికట్టారు. లీకేజీ అదుపు చేయకుంటే హెచ్‌సీఎల్ గాలిలో వ్యాపించి స్థానికులకు కళ్లు మండడంతోపాటు శరీరంపై దురదలు, దద్దుర్లు వస్తాయని అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు వివరించారు. హైవేపై వాహనాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా తగు చర్యలు చేపట్టారు. ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వేట్లపాలెం హత్య కేసులో నిందితులకు రిమాండ్

కాకినాడ క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం హత్యాకాండ జిల్లా ప్రజల వెన్నుల్లో వణుకు పుట్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి గురువారం కాకినాడ నాలుగో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిరుపమ భంజ్ డియో 14 రోజుల రిమాండ్ విధించారు. సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఒక ఇంటి నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదంలో ఇరువర్గాల పరస్పర దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని మరో వర్గం అత్యంత పాశవికంగా హత్య చేసి మరో ఏడుగురిపై హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. నిందితులైన బచ్చల మోషే, బచ్చల జకర్యా, బచ్చల బిల్లప్ప, బచ్చల దొరయ్య, బచ్చల రాము, బచ్చల గోపి, బచ్చల గవరయ్య, బచ్చల రాజు, బచ్చల సూర్యకాంతం, బచ్చల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి, కొత్తపల్లి చిన్నయ్యలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

గోపాలపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితంలేని వ్యక్తి గోపాలపురం శివారులో ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంవద్ద మృతిచెందినట్లు ఎస్‌ఐ కే.సతీష్ కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బోడిగూడెం గ్రామానికి చెందిన జక్కు గంగరాజు(50) మతిస్థిమితం లేక కొద్దిరోజులుగా ఇంటినుంచి బయటకు వెళ్లాడన్నారు. గురువారం మధ్యాహ్నం గోపాలపురం శివారులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం ఎదుట అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

సర్పవరంజంక్షన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం పండూరులో చోటు చేసుకుంది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటకు చెందిన ముద్ద సత్యనారాయణ(58) తాపీపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం తాపీపని కోసం ఇంటినుంచి బయలుదేరి వెళ్లాడు. పని ముగించుకుని గోర్స నుంచి పండూరుకి సైకిల్‌పై వెళ్తున్నాడు. పండూరులో శ్రీడిజిటల్ స్టూడియో సమీపంలోని పాలకేంద్రం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఏపీ యుజె8653 సత్యనారాయణను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముక్కు, చెవి, నోటి నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు తిమ్మాపురం ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. మృతుడు కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టెన్త్ ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం

కాకినాడ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చేమార్చిలో నిర్వహించే టెన్త్ పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తప్పుల సవరణకు పాఠశాల లాగిన్‌లో ఎడిట్ ఆప్షన్ ఎంపిక ప్రారంభిస్తామని డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల రికార్డుల్లోను, విద్యార్థి అపార్ ఐడీలో నమోదు చేసిన అన్ని దరఖాస్తులను మరోసారి తనిఖీ చేయాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో ఇంతకుముందు తప్పులు చేసిన ప్రధానోపాధ్యాయులు ఈనెల 23 వరకూ పాఠశాల లాగిన్‌లో ప్రారంభించే వెబ్ అప్లికేషన్‌లోని విద్యార్థులకు అవసరమైన ఫీల్డ్‌లో సవరణలుంటే సరిచేసేందుకు ఎడిట్ ఎంపిక అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. లోపాలు లేని డేటాను హాల్ టికెట్‌లకు అప్‌డేట్ చేయాలని డీఈవో సూచించారు.

నేడు కౌన్సెలింగ్ పద్ధతిలో పదోన్నతుల ప్రక్రియ

కాకినాడ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోని గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల ప్రక్రియను శుక్రవారం కౌన్సెలింగ్ పద్ధతిలో కాకినాడ డీఈవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరచిన సీనియారిటీ లిస్టులో తెలిపిన ఉపాధ్యాయులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు పుస్తకంతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. ముందుగా ధ్రువపత్రాల పరిశీలన తర్వాత పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

కాకినాడసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 22 వరకు మూడురోజులు కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలోని మల్టీ ఆడిటోరియంలో అంతర్ జిల్లాల, రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ విజయ ప్రకాష్, కె.మోహన్‌బాబు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 16 జిల్లాల నుంచి వివిధ విభాగాల్లో 575 ఎంట్రీలు నమోదయ్యాయన్నారు. ఈ పోటీలు ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ వి.భాస్కరరామ్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేవీఎస్ ప్రకాశరావు, పి.విశ్వనాథ్, కాకినాడ చైర్మన్ రావు చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామ న్నారు. పోటీలకు చీఫ్ రిఫరీగా రమణారావు, అసిస్టెంట్ చీఫ్ రిఫరీగా పి.వేణు వ్యవహరిస్తారన్నారు.అతిథులుగా ఓఎన్జీసీ ఈడీ కె.రత్నేష్‌కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగమణి, కాకినాడ ఏపీఎస్పీ మూడోబెటాలియన్ అధికారిణి ఎం.దీపికా పాటిల్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ సహా పలువురు విచ్చే యనున్నారని తెలిపారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

నిడదవోలు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): నిడదవోలు రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో గురువారం రైల్వేట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని నిడదవోలు మండలం తిమ్మరాజుపాలేనికి చెందిన రాకుర్తి నాగేంద్రరావు(54) మృతిచెందాడు. మృతుడు రాజమండ్రిలో ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ పి.అప్పారావు తెలిపారు.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై.. 311 వినతులు

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 2468 మంది హాజరు
- కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ





కాకినాడ కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతులు అందజేస్తున్న మాదిగ, మాల సంఘాల ప్రతినిధులు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాలవారీగా సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై కచ్చితమైన గణాంకాలతో సమగ్ర వివరాలను అందించాలని ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులను కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కాకినాడ జిల్లా కలెక్టరేట్ హాలులో ఉమ్మడి జిల్లాలో భాగమైన నాలుగు జిల్లాలకు సంబంధించిన ఎస్సీ ఉపకులాలవారీగా జనాభా, వారి స్థితిగతులపై అధికారులతో గురువారం సమీక్షించారు. ఎస్సీ ఉపకులాల ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి హాజరైన 2468 మంది నుంచి వర్గీకరణపై 311వినతులు స్వీకరించారు.

సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించిన 2011 జనాభా గణన ఆధారంగా ఎస్సీ ప్రజల గణాంకాలను ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వివరించారు. 2011 జనాభా గణాంకాల ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం జనాభా 52,85,824మంది ఉండగా ఇందులో 9,57,302మంది(18.11 శాతం) ఎస్సీ జనాభా ఉన్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో అక్షరాస్యత 70.50శాతం ఉండగా, ఎస్సీ కులాల జనాభాలో అక్షరాస్యత 69.37 శాతంగా ఉందన్నారు. పురుషుల్లో 72.96శాతంగా, మహిళల్లో 65.79శాతం అక్షరాస్యులుగా ఉన్నారన్నారు. వీరిలో ప్రధానంగా 68.507 శాతం మాల, మాల అయ్యావారు వర్గం, 22.132శాతం మాదిగ వర్గం, 4.873శాతం ఆది ఆంధ్ర వర్గం, 1.556 శాతం రెల్లి వర్గం ప్రజలు ఉండగా మిగిలిన ఉపకులాల్లో ఒకటి కంటే తక్కువ శాతం ఉన్నారని వివరించారు. అనంతరం ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక ఆర్థిక, రాజకీయ స్థితిగులపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ కాకినాడ జిల్లాలో గురువారం పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు సంబంధించిన అంశాలపై ఆయా షెడ్యూల్ కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు నుంచి వచ్చిన మొత్తం 311 వినతులను ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా స్వీకరించారు. ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఎస్సీ ఉపకుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, కులాల పునర్విభజనపై తదుపరి చర్యల నిమిత్తం కమిషన్ ప్రభుత్వానికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

బైక్‌పై లిఫ్ట్ అడిగి వెళ్తుండగా.. అదుపుతప్పి పడిపోయి..



సంఘటనాస్థలంలోనే మృతిచెందిన శ్రీను

- సంఘటనాస్థలంలోనే వ్యక్తి మృతి
- మరో యువకుడికి తీవ్రగాయాలు

దివాన్‌చెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బైక్‌పై లిఫ్ట్ అడిగి వెళ్తూ వాహనం అదుపుతప్పి పడిపోయి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు గాయపడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు దగ్గర్లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బొమ్మూరు ఎస్‌ఐ ఎస్‌పీ కుమార్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన చుక్కా శ్రీను(38) తన అత్తవారి గ్రామమైన రాజానగరం మండలం శ్రీరాంపురంలో నివాసం ఉంటున్నాడు. అతడు కూలీ పని చేసుకుని జీవిస్తుంటాడు. కాగా, గురువారం సాయంత్రం అతడు శ్రీరాంపురం అత్తవారింటికి వెళ్లేందుకు దివాన్‌చెరువు సెంటర్‌లో ఓ విద్యార్థి బైక్‌పై లిఫ్ట్ అడిగి ఎక్కాడు. వారు దివాన్‌చెరువునుంచి శ్రీరాంపురం రోడ్డులోని శ్రీచైతన్య టెక్నోస్కూల్ వద్దకు వచ్చేసరికి మోటారుసైకిల్ అదుపు తప్పి ఇద్దరూ పడిపోయారు. ఈ ప్రమాదంలో చుక్కా శ్రీను తలకు, శరీరంపైన తీవ్రరక్తపు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య, పిల్లలు శ్రీరాంపురంలోనే నివాసం ఉంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కుమార్ తెలిపారు. కాగా ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న రాజానగరం మండలం ముక్కినాడకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి అనదాసు వెంకటరమణ దివాన్‌చెరువు సమీపంలోని ఒక కళాశాలలో ఇంజనీరింగ్ విద్య మొదటి సంవత్సరం అభ్యసిస్తున్నాడు. అతడికి చేతికి, తలకు తీవ్రగాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువగా వస్తున్నాయని, బాగా చదవాలని తల్లి మందలించినందుకు బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చింతపల్లి నైపుణ్య(16) పదో తరగతి చదువుతోంది. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో నైపుణ్యకు మార్కులు తక్కువగా వస్తున్నాయని ఉపాధ్యాయిని బాలిక తల్లి సుభాషిణికి సమాచారం ఇచ్చారు. దీంతో బాగా చదువుకోవాలని తల్లి గట్టిగా మందలించింది. దీన్ని తట్టుకోలేని ఆ బాలిక గురువారం కూరగాయలకు కొట్టే పురుగుమందును తాగింది. ఇది గమనించిన తల్లిదండ్రులు అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతోందని కుటుంబీకులు తెలియజేశారు.

పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డికి చుక్కెదురు

- తమను పట్టించుకోవడంలేదని మత్స్యకార గ్రామాల్లో ప్రతిఘటన
- సమస్యలు తెలియజేస్తే డిప్యూటీ సీఎం పవన్‌కు విన్నవిస్తానని హామీ

కొత్తపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు మత్స్యకార గ్రామాల్లో గురువారం తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. కోనపాపపేటలో సముద్రకోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించేందుకు ఆయన వచ్చినపుడు అనూహ్యంగా ప్రజలనుంచి ప్రతిఘటన ఎదురైంది. పవన్ కళ్యాణ్ తరఫున ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ గ్రామాల్లో ఒకరిద్దరి మాటలకే విలువిస్తూ మిగిలిన వారిని అలక్ష్యం చేస్తున్నారంటూ వీరంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనపాపపేట సెంటర్లో ఎదురైన ఈ ప్రతిఘటనకు మర్రెడ్డి మనస్తాపం చెందారు. నాయకులంతా ఐకమత్యంగా ఉండి తనను కలిస్తే సమస్యలను నమోదు చేసుకొని డిప్యూటీ సీఎంకు నివేదిస్తానన్నారు. తాను అందరినీ సమదృష్టితో చూసుకుంటానన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి సముద్ర కోతను పరిశీలించారు.



కోనపాపపేటలో మర్రెడ్డిని నిలదీస్తున్న మత్స్యకారులు

గొల్లప్రోలులో మద్యం షాపు వద్ద ఘర్షణ

- ఇద్దరికి కత్తిపోట్లు

గొల్లప్రోలు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని మద్యం షాపు వద్ద గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురయ్యారు. బస్టాండు సమీపంలోని మద్యంషాపు వద్ద సైకిల్ పడిపోయిన విషయంలో జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఒక మైనర్ బీరు బాటిల్, కత్తితో దాడికి దిగినట్లు చెబుతున్నారు. ఈ ఘర్షణలో జి.నాగేశ్వరరావు, ఎ.వీరబాబు కత్తిపోట్లకు గురయ్యారు. వీరిని తొలుత పిఠాపురం తర్వాత కాకినాడ జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. మైనర్‌కు మరో ఇద్దరు సహకరించినట్లు సమాచారం. మద్యం షాపు వద్ద జరిగిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.



కత్తిపోట్లకు గురై గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి

రెండు జాతీయ రహదారులు

- జీలుగుమిల్లి టూ పట్టిసీమ
- పట్టిసీమ టూ కొవ్వూరు
- సీఎం ఆదేశంతో కదలిక

రాజమహేంద్రవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి అనుకూలంగా జీలు గుమిల్లి నుంచి పట్టిసీమ వరకూ అక్కడినుంచి ఏటిగట్టు వెంబడి జాతీయ రహదారి నిర్మించనున్నారు. ఈ ప్రతిపాదన ఏడేళ్ల కిందటే ఉన్నప్పటికీ, ఇటీవల పోలవరం వచ్చిన సీఎం చంద్రబాబు ఆదేశంతో మళ్లీ కదిలింది. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, కన్నాపురం, కెఆర్‌పురం, దొండపూడి మీదగా పట్టిసీమ వరకూ ఈ జాతీయ రహదారిని నిర్మించనున్నారు. జీలుగుమిల్లి నుంచి కొంతమేర ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇక పట్టిసీమ నుంచి ఏటిగట్టును విస్తరించుకుంటూ కొవ్వూరు టౌన్ వరకూ కూడా జాతీయ రహదారిని నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం అధికారులతో సమీక్షించారు. ఇటీవల పోలవరం వచ్చిన సీఎం ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానంగా హైవే నిర్మాణంపై కూడా దిశా నిర్దేశం చేశారన్నారు. జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ గ్రామానికి అనుసంధానం చేస్తున్న హైవేకు సంబంధించిన భూసేకరణపై సమగ్ర వివరాలతో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ నెల 23, 26వ తేదీల్లో ఎన్‌హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయనున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు.

చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

- ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి



క్రికెట్ ఆడి జట్టు ఎంపికలు ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా తగిన ప్రాధాన్యమివ్వాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు గురువారం జరగ్గా వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటూ ఆటలు ఆడాలన్నారు. ఎంపికల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో క్రీడాభివృద్ధికి విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు అన్నీ కృషిచేయాలని సూచించారు. కార్యనిర్వాహక కార్యదర్శి వీవీఎంయూ ఫణీంద్ర మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని 40 నుంచి 50 కళాశాలల నుంచి 80 నుంచి 90 మంది క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరయ్యారన్నారు. ఇక్కడ బాగా ప్రతిభ కనబరచిన 16మందితోపాటు మరో ఆరుగురు క్రీడాకారులను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేస్తామన్నారు. వచ్చేనెలలో తమిళనాడులో యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో జరిగే టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విద్యకళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ లింగారెడ్డి, విద్య కళాశాల అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, మూర్తి, రామ్‌గోపాల్ సత్యనారాయణ, సాల్మన్‌దేవానంద్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాధితురాలి రోధన

గోపాలపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ వేడినీళ్లు పడి శరీరం కాలిపోయి రోదిస్తూ ఆస్పత్రికి వచ్చిన రోగికి సరైన వైద్యం అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని రోగి బంధువులు గురువారం విలేఖర్లకు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన ఎలిపే ఇందిరమ్మ బుధవారం రాత్రి ఇంట్లో వంట వండే సమయంలో వేడి నీళ్లు మీదపడ్డాయని వారు తెలిపారు. దీంతో శరీర ఉదర భాగమంతా కాలిపోవడంతో హుటాహుటినా ఆమెను గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి అర్ధరాత్రి సమయంలో తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తెల్లవార్లు ఆమె కాలిన గాయాలతో రోధిస్తూనే ఉందన్నారు. ఆస్పత్రి సిబ్బంది కొంతమేర వైద్యంఅందించినా బాధితురాలికి పూర్తిస్థాయిలో వైద్యసేవలందించలేదన్నారు. గురువారం ఉదయం ఆస్పత్రికి వచ్చిన మిగిలిన వైద్యులు ఆమెను పరిశీలించి శరీరంలో ఉదరభాగం 20శాతం కాలిపోయిందని రిజిస్టర్ పరిశీలించగా కనీసం ఆ బాధితురాలి పేరు నమోదు కాకపోవడంతో నివ్వెరపోయినట్లు తెలిపారు. మెరుగైన వైద్య కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లాలని బాధితురాలి బంధువులకు వైద్యులు సూచించారు. దీంతో ఆగ్రహించిన వారు వైద్యురాలిని నిలదీయగా హడావుడిగా వైద్యంఅందించి మధ్యాహ్నం రాజమహేంద్రవరం తరలించారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ వైద్యులు చైతన్యరాజును వివరణ కోరగా డ్యూటీ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యురాలికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.





నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు

అమలాపురంటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అమలాపురం ముస్లిం వీధిలోని సయ్యద్ హజరత్ ఖ్వాజాబాబా 67వఉరుసు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల20 నుంచి ఉరుసు ఉత్సవాలు జరుగుతాయని దర్గాకమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం పకీరు మేళాలతో ముస్లింవీధి, గడియార స్తంభంసెంటర్ మీదుగా ఊరేగింపు చేశారు.

సంతాపం

అమలాపురంటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన బైబిల్ సొసైటీ మాజీ అధ్యక్షుడు బ్రదర్ పి.పాల్‌ప్రసాద్ మృతికి టౌన్ క్రిస్టియన్ అసోసియేషన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. పాల్‌ప్రసాద్ పేదలకు, క్రైస్తవులకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. యూత్ అధ్యక్షుడు నక్కా రాజ్‌కిశోర్ సంతాపం తెలిపారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

అమలాపురం రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈదరపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జిల్లా శాఖ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు బీజేపీ అహంకారానికి నిదర్శనమని చిట్టిబాబు చెప్పారు. దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా అమిత్‌షా మాట్లాడారన్నారు. రాజీనామా చేసి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వంటెద్దు బాబి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, చీకట్ల అబ్బాయి, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, అధికార ప్రతినిధి



ఈదరపల్లిలో కాంగ్రెస్ నిరసనలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లాశాఖ అధ్యక్షుడు చిట్టిబాబు

ముషిణి రామకృష్ణారావు, నాయకులు మాచవరపు శివన్నారాయణ, దోనిపాటి విజయలక్ష్మి, కుడుపూడి శ్రీనివాసరావు, షకీలా, పేరి శర్మ, వస్కా బాబు, మొల్లేటి వెంకటేశ్వరరావు, పులుసుగంటి ప్రకాష్, ములపర్తి మోహనరావు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

అమలాపురం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తక్షణం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కేవీపీఎస్, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద చర్యలను ప్రజలంతా ఖండించాలన్నారు. ప్రజాసంఘాల నాయకులు జి.హరీష్ కుమార్, పొలమూరు శ్రీనివాసరావు, జి.మురళీ, విజయ్, బాలకృష్ణ, దైవవాణి పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా



ఈదరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు

అమలాపురం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్, చండీఘర్ రాష్ట్రాల విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను నిరసిస్తూ గురువారం ఈదరపల్లిలోని ప్రధాన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్‌సీసీ, ఓఈఈఈ, ఏపీఎస్పీఈ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలని నినాదాలు చేశారు. జేఏసీ చైర్మన్ ఎంపీ రమణ, విద్యుత్‌శాఖ ఈఈ ఎం.రవికుమార్, 1104 యూనియన్ అధ్యక్షుడు బి.సత్యసాయి, కార్యదర్శి సాకా రామారావు, ఏడీఈ జి.అన్నవరం, టౌన్ ఏఈ ఎస్.ఆనందరాజుతో పాటు విద్యుత్ ఉద్యోగులు ధర్నాలో తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళులు

మలికిపురం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మోరి మాజీ సర్పంచ్ జాన సత్యనారాయణ విజయలక్ష్మి సేవలను సర్పంచ్ పసలపూడి లక్ష్మీపద్మమంగతాయరు కొనియాడారు. గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ జాన సూర్యావతి, కార్యదర్శి కొండా బులిసూరన్న, వీఆర్వో రమ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గంటిపెదపూడి 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు, ఆర్‌డీఎస్ఎస్ లైన్ పనులు కోసం నరేంద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని నరేంద్రపురం, కుందాలపల్లి, రాజులపాలెం, గంటిపెదపూడి, ఉడిమూడి, ఉడిమూడిలంకలు, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 5గంటలు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఏఈ ఎం.రవికుమార్ తెలిపారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

కాట్రేనికోన, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అయితాబత్తుల పండుబాబు అన్నారు. గురువారం కాట్రేనికోన గేట్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అమిత్‌షా చిత్రపటాన్ని అగ్నికి ఆహుతి చేశారు. అమిత్‌షా రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముమ్మిడివరం నియోజకవర్గ కన్వీనర్ పాలెపు ధర్మారావు, కంచుస్తంభం సోనీ, లంకే నాగరాజు, మల్లాడి శ్రీను, మల్లాడి గోపి, చెల్లూరి బాలకృష్ణ, నవుడూరి శ్రీనివాసరావు, పాలెపు ధర్మరాజు, పాలెపు శ్రీనురాజు పాల్గొన్నారు.

స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

అల్లవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) అల్లవరం పోలీసు స్టేషన్‌ను ఎస్పీ కృష్ణారావు గురువారం రాత్రి తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్ రికార్డులను ఆయన పరిశీలించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఆయన వెంట అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ పి.వీరబాబు, ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఉన్నారు.

గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

అల్లవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గోడితిప్ప క్రీస్తు ఆదరణ దేవాలయంలో పాస్టర్ వై.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ ఆరాధన వేడుకలు జరిగాయి. ప్రసంగీకులు డబ్ల్యూసీఎం కిరణ్‌పాల్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ క్రీస్తు బోధనలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, చిట్నీడి శ్రీనివాస్, తోట నరసింహారావు, పల్లి జేమ్స్ రాజు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు

మండల ప్రజాపరిషత్ సమావేశం

కాట్రేనికోన, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు సానబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. కుండలేశ్వరంలో ఎంపీపీ పాఠశాల భవన నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఎంపీటీసీ అక్కల శ్రీధర్ తప్పుబట్టారు. రూ.15లక్షలు మంజూరైనా నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని సమావేశపు హాలులో నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. మిలిటరీ పాఠశాల పల్లపు ప్రాంతంలో ఉండటంతో వర్షం నీటితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, బొజ్జావారిపేట స్కూల్ భవన నిర్మాణం ఎప్పుడు చేస్తారా అని కందికుప్ప ఎంపీటీసీ గెద్దాడ గుణవేణుకుమార్ ఎంఈవోను నిలదీశారు. గచ్చకాయలపొరలో తాగునీరందక మత్స్యకారులు ఇక్కట్లు పడుతున్నారని ఎంపీటీసీ సంగాని మునీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో అక్రమ లేఅవుట్లను అధికారులు పట్టించుకోవడం లేదని, గచ్చకాయలపొరలో హైస్కూల్ స్థలం మెరక చేసే సాకుతో ఇసుక దందా నడిచినా రెవెన్యూ అధికారులు చోద్యం చూశారని ఎంపీటీసీ అక్కల శ్రీధర్ వ్యాఖ్యానించారు. మెరక చేయడానికి మాత్రమే అనుమతి ఇచ్చామని తహశీల్దార్ సునీల్‌కుమార్ వివరించారు. అయిదు నెలలుగా ట్రాన్స్‌కో ఏఈ పోస్టు ఖాళీగా ఉన్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ శ్రీధర్ ఆరోపించారు. సమావేశానికి అధికారుల గైర్హాజరుపై కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ నిరసన తెలిపారు. చిర్రయానాంలో పక్కా గృహాల మంజూరుకు ఇంటికి రూ.150 వసూలు చేస్తున్నారని స్థానిక సర్పంచ్ ఆరోపించారు. ప్రత్యేక యాప్ ద్వారా నమోదు ప్రక్రియ ఉంటుందని, సొమ్ములు ఇచ్చినంత మాత్రాన ఇళ్లు మంజూరు కావని హౌసింగ్ డీఈఈ మల్లికార్జునరావు వివరించారు. చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్ జోక్యం చేసుకుని తెలుగుదేశం సభ్యత్వాలకు వసూలు చేసిన రుసుమును ఇళ్ల మంజూరు కోసమని ప్రచారం చేయడం తగదన్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో సిబ్బంది సరిగా పని చేయడం లేదని, కాట్రేనికోన సబ్ సెంటర్ ఎల్లప్పుడూ మూసి ఉంటుందని సర్పంచ్ వెంకటసుధాకర్, మరికొందరు సభ్యులు వైద్యాధికారి దృష్టికి తెచ్చారు. మురుగుకాల్వలకు మరమ్మతులు చేసి వరి పంటను కాపాడాలని మండల ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. సమావేశంలో జడ్పీటీసీ నేల కిశోర్, వైస్ ఎంపీపీ ఏడిద అరుణ, మోకా చంద్రనాగరత్నం, ఏఈ ఫకీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు

విద్యార్థి స్థాయిని బట్టి బోధన సాగించాలి

డీఈవో షేక్ సలీంబాషా

ముమ్మిడివరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థి స్థాయి ఆధారంగా బోధన చేసినప్పుడు విద్యార్థి అభ్యసన స్థాయిలు మెరుగుపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. జ్ఞానజ్యోతి 120రోజుల సర్టిఫికెట్ కోర్సు, డీఆర్పీ పునఃశ్చరణ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమైంది. శిక్షణ శిబిరంలో డీఈవో సలీంబాషా మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు బోధనలో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థి స్థాయికి తగ్గట్టుగా ఆసక్తికరంగాగా బోధన చేసినప్పుడే విద్యార్థుల ఎన్‌రోల్మెంట్ పెరుగుతుందన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు సమాజంలో ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఝాన్సీరాణి మాట్లాడుతూ డీఆర్పీలకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించడం ఒక



మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీంబాషా

చక్కటి అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కోర్సు కోఆర్డినేటర్ సీనియర్ ఎంఈవో బొజ్జా రమణశ్రీ మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని, తిరిగి క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలన్నారు. సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో 22మండలాల నుంచి 62మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, 54మంది అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శిక్షణలో పాల్గొన్నారన్నారు. మూడు రోజుల శిక్షణ అనంతరం తిరిగి మండలస్థాయిలో డీఆర్పీలు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డైట్ లెక్చరర్ కళావతి, ఐసీడీఎస్ పీవో విజయశ్రీ మాట్లాడారు. శిక్షణలో డీఆర్పీలకు ఫోల్డర్, పుస్తకం, పెన్నుతో కూడిన కిట్‌లను అందజేశారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి డి.హనుమంతరావు, ఎంఈవో-2 ఆర్ ఉదయభాస్కరరావు, పాఠశాల హెచ్ఎం సీహెచ్ పరిమళ, రిసోర్స్ పర్సన్‌లు జె.కళావతి, విజయశ్రీ, కేవీఆర్ తాతాజీ, పి.నిర్మలాకుమారి, వి.వరాహలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ..

డీఈవో షేక్ సలీంబాషా గురువారం ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న పరీక్షలు నిర్వహించిన తీరును పరిశీలించారు. అన్నితరగతుల గదులను పరిశీలించి శానిటేషన్‌పై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పాఠశాల అభివృద్ధి, విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని హెచ్ఎం సీహెచ్ పరిమళకు సూచించారు. పాఠశాల నిర్వహణ తీరుపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు.

పరపతి సంఘాలకు త్వరలో పాలకవర్గాలు

మలికిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని 26 పరపతి సంఘాలకు త్వరలో నామినేటెడ్ కమిటీలను నియమించనున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ప్రతీ సంఘానికి ముగ్గురు సభ్యులను ఎంపిక చేస్తామని, వారిలో ఒకరిని చైర్మన్‌గా నిర్ణయిస్తామన్నారు. ఎన్డీయే ఒప్పందంలో భాగంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నట్టు చెప్పారు.

అభివృద్ధికి చిరునామా రాజోలు..

రాజోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేయడమే తన ఎజెండా అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్‌ను గురువారం ప్రారంభించారు. రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మలికిపురంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో అనవసరంగా రూ.140కోట్ల ఉపాధి నిధులతో రైతు భరోసా వంటి భవనాలకు కేటాయించి వాటిని కూడా పూర్తి చేయలేదన్నారు. గుడిమూల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు టెండర్లు ఖరారయ్యాయని, ఏప్రిల్ నెలలో అందుబాటులోకి వస్తుందన్నారు. గుడిమెళ్లంకలో కూడా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తామన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు దంపతులను డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లుగా ఎంపికైన పినిశెట్టి బుజ్జి, గుబ్బల శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



మలికిపురంలో సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

ఆపరేషన్ స్వేచ్ఛ

అమలాపురం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ స్వేచ్ఛలో భాగంగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎ.విజయ్‌ప్రకాష్ ఆధ్వర్యంలో అమలాపురం పట్టణం, అంబాజీపేటల్లో గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇటుకల బట్టీలు, షాపులు, బేకరీలు, హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించి 14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోకూడదని, ఎవరైనా పెట్టుకుంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 15నుంచి 18ఏళ్ల వయసు గల పిల్లలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టుకోకూడదని సూచించారు.

బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

అంబాజీపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలలను పనులో పెట్టుకుంటే సంబంధిత యజమానిపై లేబర్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ అధికారి ఎ.విజయప్రకాష్ హెచ్చరించారు. అంబాజీపేట మండలంలోని బేకరీలు, హోటల్స్, బంకులు, ఇటకబట్టీలతో పాటు పలు షాపులను ఆయన తనిఖీ చేశారు. చిన్నారులతో పని చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. సీఆర్పీ వెంకటేష్, కానిస్టేబుల్ రమణ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు

రాజోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని డీఎల్పీవో పి.బొజ్జిరాజు అన్నారు. సోంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ అధ్యక్షతన గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు డీఎల్పీవో ముఖ్య అతిథిగా మాట్లాడారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 29దరఖాస్తులు, రేషన్‌కార్డు కోసం 30, గృహనిర్మాణానికి 13, పెన్షన్లు కోసం 41, ఇతర శాఖలకు సంబంధించి 5, మొత్తం 118దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీ

పేదల కోసం కిమ్స్ అందిస్తున్న వైద్యసేవలు భేష్ : మంత్రి సుభాష్

అమలాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో 22 సంవత్సరాల క్రితం నెలకొల్పిన కిమ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ద్వారా ఈప్రాంత ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత కేవీవీ సత్యనారాయణరాజుకు దక్కిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అమలాపురంలోని కిమ్స్ ఆడిటోరియంలో నిర్వహించిన 22వ వార్షికోత్సవ సభలో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కిమ్స్ విద్యా సంస్థల చైర్మన్ చైతన్యరాజు, ఎండీ రవికిరణ్‌వర్మ ఈప్రాంత ప్రజల కోసం అంకితభావంతో అందిస్తున్న వైద్యసేవలు ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన కిమ్స్ విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ పేదలకు వైద్యసేవలందించడానికి అమలాపురంలో ఏర్పాటుచేసిన కిమ్స్ కళాశాల అంచెలంచెలుగా ఎదిగి దేశవిదేశాల్లో ఎనలేని ఖ్యాతిని పొందడం తమకు గర్వంగా ఉందన్నారు. అమలాపురం, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల సుబ్బరాజు కిమ్స్ సేవలను కొనియాడారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కిమ్స్ ఎండీ కె.రవికిరణ్‌వర్మ, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల దొరబాబు, మోకా సుబ్బారావు, జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ మాజీచైర్మన్ నల్లా విష్ణుమూర్తి, నల్లా పవన్, డాక్టర్ గొలకోటి రంగారావు, పెన్మెత్స చిట్టిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొర్రా ఈశ్వరరావు, నల్లా స్వామి, వైద్య నిపుణులు, వివిధ వర్గాలకు చెందిన మేధావులు ప్రసంగించారు.



కిమ్స్‌లో ఆయుష్ భరోసా మెంబర్‌షిప్ కార్డును ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు, ఎమ్మెల్యేలు

ఆయుష్ భరోసా ఆవిష్కరణ..

కిమ్స్ మెడ్ యునైటెడ్ ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టి ఆయుష్‌భరోసా ఇన్సూరెన్సు స్కీమును ఈసందర్భంగా ప్రముఖుల సమక్షంలో మంత్రి సుభాష్, కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు, ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. ఆయుష్ భరోసా స్కీమ్‌కు సంబంధించిన లక్ష్యాలతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం
ఆర్టికల్ 341పై పార్లమెంటులో చర్చ నిర్వహించాలి



కాకినాడ కలెక్టరేట్‌లో కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాకు అర్జీలు అందిస్తున్న కోనసీమ జిల్లాకు చెందిన మాల ప్రతినిధులు

అమలాపురం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఆర్టికల్ 341పై పార్లమెంటులో చర్చ నిర్వహించి మెజార్టీ సభ్యులు, రాష్ట్రపతి ఆమోదంతో ముందుకు వెళ్లాలని కోనసీమ జిల్లాకు చెందిన మాల ప్రతినిధుల బృందాలు గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్‌రంజన్ మిశ్రాను కలిసి అర్జీలు అందజేశారు. వర్గీకరణ అంశంపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సైతం రాజ్యాంగ విరుద్ధమని, తక్షణం రద్దు చేయాలని కోరినట్టు ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు తెలిపారు. తొలుత కులగణన చేపట్టి ఏ కులం వారు ఎంతమంది ఉన్నారో లెక్కలు తేల్చాకే వర్గీకరణపై ముందుకు వెళ్లాలని కోరామన్నారు. ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబూరావు ఆధ్వర్యంలో నాయకులు గొల్లపల్లి డేవిడ్‌రాజు, నెల్లి లక్ష్మీపతి, బడుగు జేమ్స్‌పాల్, దుక్కిపాటి సత్యనారాయణ, గెడ్డం సురేష్‌బాబు, పొలమూరి మోహన్‌బాబు, చింతా రాజబాబు, బత్తుల మురళీకృష్ణ, బొంతు మణిరాజు, కప్పల శ్రీధర్, ఆర్.నాగభూషణం, రేవు తిరుపతిరావు తదితరులు మిశ్రాను కలిసి అర్జీలు అందించారు. మాల మాదిగలను విడదీసే కుట్రలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ చేపట్టారని, ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాలమహానాడు కన్వీనర్ చీకురుమెల్లి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మాదే ప్రసాదరావుల ఆధ్వర్యంలో అర్జీ అందించారు. ఎస్సీ మాల న్యాయవాదుల వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కటికదల సత్యనారాయణ ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం ఏకసభ్య కమిషన్ చైర్మన్‌ను కలిసి అర్జీ అందించింది. కుల వర్గీకరణ ద్వారా సమన్యాయం, సామాజిక న్యాయం రెండూ జరగవని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.మల్లికార్జునరావు, నందిక శ్రీనివాస్, పెయ్యల సత్యనారాయణ, పరమట రామ్‌ప్రసాద్, బి.వెంకటరమణ, చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ నాయకుల నిరసన

ముమ్మిడివరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ కువవివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం ముమ్మిడివరం పోలమ్మ చెరువు గట్టు ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అంబేడ్కర్‌కు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, మంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలని నినాదాలు చేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షురాలు గుడే దుర్గాప్రసాద్, మండల నాయకులు యన మదల బాలరాజు, మహిళా సంఘ నాయకురాళ్లు సత్యవతి, మల్లేశ్వరి, కుమారి, సుజాత, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు దొమ్మేటి వీరరాఘవులు, కె.లక్ష్మణ్, కొప్పిశెట్టి గణేష్, రాయుడు వీర్రాజు, జోషప్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ముమ్మిడివరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్లు, క్యాటిల్ షెడ్లను గురువారం ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య పరిశీలించారు. అన్నంపల్లి పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులను, చినకొత్తలంకలో నిర్మిస్తున్న క్యాటిల్ షెడ్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అన్నంపల్లి, చినకొత్తలంక సచివాలయ సిబ్బంది హాజరు రిజిష్టర్లను పరిశీలించి వారికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

22న జనసేన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

ముమ్మిడివరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలకు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటుచేసినట్టు జనసేన పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ అధ్యక్షుడు దూడల స్వామినాయుడు తెలిపారు. ఈనెల22న ఆదివారం ఉదయం 8 గంటలకు ముమ్మిడివరం మండలం కొమానపల్లిలోని అతిథి గృహంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. జనసేన పార్టీ ఎన్నికల ముందు నుంచి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలపై, పార్టీ బలోపేతంపైనా చర్చిస్తారన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ మండల కమిటీలు, గ్రామ కమిటీలు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు సమావేశానికి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమీక్షా సమావేశం

ముమ్మిడివరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 2025-26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనా ఖర్చులు, రాబడులపై శాఖాధిపతులతో ఈనెల23న డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వర్కుషాపు నిర్వహిస్తామని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన ఏఈ, ఎమినిటీ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో నగరపంచాయతీ మౌలిక సదుపాయాల కల్పన, ఈఏపీ విశ్లేషణపై వర్కుషాపు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పీవీ నూకరాజు, ఏఈ పీవీ సుధాకర్, సీపీవో బి.సురేష్‌బాబు, జేఏవో రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ జె.సత్యనారాయణరాజు, ఆర్ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ రవిశంకర్, అక్కౌంటెంట్ సుబ్బారావు, జూనియర్ అసిస్టెంట్ కె.లక్ష్మీనారాయణ, షరాఫ్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు, సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి సూచించారు. ఇసుకపూడిలో సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో 15అర్జీలు వచ్చాయి. సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ, సచివాలయ, దేవదాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోనసీమ అగ్నికుల క్షత్రియ కన్వీనర్‌గా పెమ్మాడి



అల్లవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నానికి చెందిన పెమ్మాడి సాయిబాబును కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడు కర్రి స్వామినాథ్ ఆదేశాల మేరకు పెమ్మాడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని కోనసీమ జిల్లా అధ్యక్షులు తారాడి శివ ఓ ప్రకటనలో తెలిపారు. కోనసీమ అగ్నికుల క్షత్రియుల సంఘ బలోపేతానికి కృషిచేస్తానని పెమ్మాడి పేర్కొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

మామిడికుదురు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల రక్షణ కోసం నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ విశ్వహిందూ పరిషత్ సభ్యులు కరపత్రాలను గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. జనవరి 5న విజయవాడలో జరిగే శంఖారావడం కార్యక్రమానికి అధిక సంఖ్యలో హిందూ భక్తులు హాజరవ్వాలని కోరుతూ మామిడికుదురులో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుద్ర శ్రీను, కూనపరెడ్డి రాము, చవటపల్లి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను సరిచేశారు
ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మామిడికుదురు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని షిర్డిసాయిబాబా ఆలయ సమీపంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రజలు పడుతున్న ఇబ్బందలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ తీగలు వేలాడుతున్న ప్రాంతంలో కొత్తగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేసి వేలాడుతున్న తీగలను సరిచేసి కొత్త స్తంభానికి తీగలు కట్టడానికి శ్రీకారం చుట్టారు. విద్యుత్‌శాఖ సబ్‌ఇంజనీర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేశారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించి అధికారులు ప్రజల సమస్య తీర్చడంతో వారు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

మామిడికుదురు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మారుమూల ప్రాంతాలకు మహర్దశ ఏర్పడిందని నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి పేర్కొన్నారు. నగరం గ్రామంలోని బీబీషకీనా ఆస్తాన వద్ద మండల పరిషత్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డుకు సర్పంచ్ గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాలెం రమణకుమారి, కుసుమ శ్రీధర్, జాలెం సుబ్బారావు, సజ్జాద్‌హుస్సేన్, కడలి శ్రీను, కోళ్ల సురేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కారం

పి.గన్నవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలు పరిష్కరిస్తామని తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. ఉడిమూడిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు అందించిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఎంపీటీసీలు ఆదిమూలం సూర్యనారాయణమూర్తి, అయినపర్తి ప్రియదర్శిని, ఆర్ఐ వర్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరుపులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దేవ

రాజోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శివకోడు గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 200మంది బాలికలకు మానవతామూర్తుల గ్రూపు, పలు స్వచ్ఛంద సంస్థలు సమకూర్చిన రూ.4లక్షల విలువైన పరుపులు, దుప్పట్లను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి అధ్యక్షతన జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలికలకు పరుపులు, బెడ్‌షీట్లు సమకూర్చిన పలువురు దాతలను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, సామాజిక కార్యకర్త బోనం రాజు, రాజోలు మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

యానాం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని యానాం ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ అన్నారు. స్థానిక మెట్టకుర్రులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ సి.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నవోదయ వార్షిక క్రీడా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వాలీబాల్, షటిల్, ఖోఖో, 400,200,100మీటర్ల పరుగు పందెం పోటీలు,షాట్‌పుట్, డిస్కస్‌త్రో, హైజంప్, లాంగ్‌జంప్, జావలిన్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఓవరాల్ చాంపియన్ షిప్ శివాలిక్ సదన్, రన్నర్‌గా ఆరావళి సదన్ నిలిచారు. కార్యక్రమంలో విద్యాలయం సీనియర్ ఉపాధ్యాయుడు సాంబశివరావు, క్రీడా ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముమ్మిడివరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెం సూరాయిచెరువు సమీపంలో గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఉప్పలగుప్తానికి చెందిన రాయుడు దుర్గాప్రసాద్ మోటారుసైకిల్‌పై బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతుండగా ముమ్మిడివరం నగర పంచాయతీ గుత్తులవారిపాలేనికి చెందిన దొంగ సూర్యసందీప్ మోటారుసైకిల్‌పై ఎదురుగా వస్తూ ఢీకొనడం ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీ నాయకుడు సానబోయిన చంటి ఆధ్వర్యంలో గాయపడిన రాయుడు దుర్గాప్రసాద్‌ను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి, దొంగ సూర్యసందీప్‌ను ముమ్మిడివరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలో చేరిక

అమలాపురంరూరల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లిలోని తెలుగునాడు విద్యుత్ కార్మికసంఘం సమావేశం సీహెచ్ గిరిధర్ అధ్యక్షతన గురువారం జరిగింది. అమలాపురం డివిజన్‌స్థాయిలో జరిగిన సమావేశంలో వివిధ సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు, తెలుగునాడు కార్మిక సంఘంలో చేరారు. షిఫ్టుఆపరేటర్ల సమస్యలను, వేతన వ్యత్యాసాలను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని రీజనల్ అధ్యక్షుడు భారతి వెంకటేశ్వరరావు అన్నారు. సంఘంలో చేరిన సభ్యులను డివిజనల్ కార్యదర్శి విత్తనాల మోహన్‌బాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు కె.బాలాజీ, డి.రమేష్, టి.సుధాకర్‌రెడ్డి, డీవీకుమార్‌రాజాగౌడ్, దొమ్మేటిశ్రీనివాసరావుఅభినందించారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

అంబాజీపేట, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రుకు చెందిన గుత్తుల గీతాసంధ్య(22) ఈనెల18న ఇంటి వద్ద అపస్మారకస్థితిలో ఉండటంతో స్థానికులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్లు పోలీసులు తెలిపారు. చిన్నాన్న గుత్తుల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసు అధికారులకు సన్మానం

అంతర్వేది, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దోపిడీ కేసులో నిందితుల నుంచి రూ.10లక్షల విలువైన బంగారం రికవరీచేసిన సందర్భంగా పోలీసు అధికారులకు ప్రజలు అభినందనలు తెలిపారు. కర్తవ్య నిర్వహణ ద్వారా పోలీసు అధికారులు ప్రజలకు ధైర్యానిచ్చారని కొనియాడారు. టాండన్ రాజు, గెడ్డం ప్రభాకరరావు, చింతా శేషు, బీర సువర్ణరాజు, గెడ్డం బాలరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సలీం బాషా

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి: డీఈవో

రావులపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా అన్నారు. రావులపాలెంలో సీఆర్సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని తొమ్మిది జడ్పీ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. పాఠ్యాంశాలను ఎలా చదివి అర్థం చేసుకోవాలి, పరీక్షలు ఏ విధంగా రాయాలి తదితర అంశాలపై మోటివేషన్ స్పీకర్, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర అవగాహన కల్పించారు. ఎస్ఎంసీల ఛైర్మన్లు నందం వీర వెంకట సత్యనారాయణ, కోట సోమేష్, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంఈవోలు నాగకుమార్, శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిథిల భవనంలో కొనసాగుతున్న సచివాలయం



అసంపూర్తి నిర్మాణంతో వినియోగానికి నోచుకోని సచివాలయ భవనం

అసంపూర్తి నిర్మాణం... అలంకారప్రాయం

ఇదీ ఆత్రేయపురం గ్రామ సచివాలయం పరిస్థితి

ఆత్రేయపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం గ్రామ సచివాలయ భవనం అసంపూర్తి నిర్మాణంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. రూ.40లక్షల వ్యయంతో రెవెన్యూ కార్యాలయం పక్కనే సచివాలయ భవనం నిర్మించారు. దీనిని సార్వత్రిక ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పదకొండు నెలలుగా అతీగతీ లేకుండా వుంది. ప్రస్తుత సచివాలయం శిథిలస్థితికి చేరుకున్న సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో నడుస్తోంది. ఆ భవనం పెచ్చులూడిపోయి బీటలు వారింది. కొద్దిపాటి వర్షానికే స్లాబు లీకవుతుండడంతో సిబ్బందికి విధుల నిర్వహణ కష్టతరంగా మారింది. ఎదురుగా భవనం నిర్మాణం పూర్తయినా అరకొర పనులు మిగిలి వున్నాయి. దీంతో దాంట్లోకి వెళ్లలేక, శిథిల భవనంలో పనులు చేయలేక సిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు. నిర్మాణాన్ని తక్షణం పూర్తి చేయాలని ప్రజలు, సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.



ఎమ్మెల్యే శిరీషకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో సూర్యచక్రధరరావు

వాడపల్లి వెంకన్న సన్నిధిలో పలాస ఎమ్మెల్యే

ఆత్రేయపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రానికి గురువారం రాత్రి శ్రీకాకుళం జిల్లా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేశారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యే కుటుంబీకులకు వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి చిత్రపటాన్ని ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు అందజేశారు.



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో 'భాష్యం' విద్యార్థుల ప్రతిభ

కొత్తపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో భాష్యం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కలర్ బెల్ట్ 31-35 కేజీల విభాగంలో కె.శరత్‌తేజ (బంగారు), 50-55 కేజీల విభాగంలో వివేక్ వెంకటసాయివర్మ (రజత), 36-40 కేజీల విభాగంలో జి.విష్ణుశ్రీతేజ (రజత) పతకాలు సాధించారు. కోచ్ గుబ్బల సుబ్రహ్మణ్యం వద్ద వీరు శిక్షణ పొందారు. విజేతలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం తన నివాసంలో అభినందించారు. కార్యక్రమంలో గుబ్బల మూర్తి, భాష్యం ప్రిన్సిపాల్స్ జె.సూరిబాబు, జ్యోతిభవాని, సాయికిరణ్, జోనల్ ఇన్‌చార్జి జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలకు ప్రజా సంఘాల నిరసన

ద్రాక్షారామ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం ద్రాక్షారామ-యానాం సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం ప్రజా సంఘాల నాయకులు ప్రదర్శన జరిపారు. అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, సీపీఎం నాయకుడు నూకల బలరాం మాట్లాడుతూ అంబేడ్కర్‌ను పార్లమెంటు సాక్షిగా కించపరచడం దురదృష్టకరమన్నారు. అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జై భీమ్ సంక్షేమ సేవా సంఘం నాయకులు గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ నాయకులు చింత రాజారెడ్డి, కేవీపీఎస్ సత్తిబాబు, కె.సింహాద్రి, డి.అబ్రహం, కె.సత్తిబాబు, పి.బాలకృష్ణ, జి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



సైన్స్ అధ్యాపకుడు శ్రీనివాసరావుకి జీవిత సాఫల్య పురస్కారం

మండపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ కరుటూరి శ్రీనివాసరావు మెటీరియల్ సైన్స్ రంగంలో జీవిత సాఫల్య పురస్కారాన్ని సైంటిఫిక్ లారెల్స్ సంస్థ ప్రదానం చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కేటీటీపీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంకితభావం, క్రమశిక్షణ గల డాక్టర్ శ్రీనివాసరావు నావికాదళ అధికారిగా విశేష సేవలందించారు. అనేక పరిశోధనలు చేయడంతో పాటు అనేక జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.



వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

ఇంటింటికీ తాగునీరందిస్తాం: ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని మూలస్థానం అగ్రహారంలో రూ.37.10 లక్షలతో వాటర్ ట్యాంక్ (ఓహెచ్ఎస్ఆర్) నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాగునీటికి అధిక ప్రాధాన్యమిచ్చి వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నట్టు చెప్పారు. కొత్తపేట నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. పలువురు మహిళలు సమస్యలను బండారు దృష్టికి తీసుకొచ్చారు. మండల స్థాయి అధికారులతో చర్చించి వాటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, గ్రామ సర్పంచ్ లంక వరప్రసాద్, కూటమి నాయకులు సలాది జయప్రకాష్‌నారాయణ, మెర్ల గోపాలస్వామి, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్, దొంగ భాస్కరరావు, సూరపురెడ్డి సత్య, గారపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం (ద్రాక్షారామ), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం 11కేవీ టౌన్ ఫీడర్ అత్యవసర మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు తెలిపారు. సూర్యనగర్, అంకం వారివీధి, గుబ్బలవారిపేట, రామకృష్ణ సెంటర్, మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ లైన్ మరమ్మతుల పనులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. రాయవరం, నదురుబాద, వి.సావరం, వెదురుపాక, లొల్ల, చెల్లూరు, మాచవరం, సోమేశ్వరం, పసలపూడి గ్రామాలతో పాటు అనపర్తి మండలం మహేంద్రవాడ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు నేడు శిక్షణ

మండపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు గ్రామాల అభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు పరిపాలనాధికారి ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీలు, ఎంపీటీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో టీపీడీపీ కార్యాచరణ ప్రణాళిక 2025-26పై శుక్రవారం శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే శిక్షణకు మండలంలోని 12 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు హాజరు కావాలని ఆమె కోరారు.

పామర్రులో కంటి వైద్య శిబిరం



కె.గంగవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పామర్రులో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దేవరపల్లి సత్యనారాయణ నివాసం వద్ద వైద్యులు వంద మందిని పరీక్షించారు. శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు రావిపాటి సత్యనారాయణ, తూము మాధవరావు, విస్సాప్రగడ కృష్ణమూర్తి, కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు, సాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



సచివాలయాల ఉద్యోగులు, సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనరు రంగారావు

ఖాళీ స్థలాలకు పన్ను చెల్లించాలి: కమిషనరు

మండపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'పట్టణంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి... దీంతో సమీపంలోని నివాసితులకు ఇబ్బంది కలుగుతోంది... అడవిలా తయారైన పిచ్చిమొక్కలను తక్షణం తొలగించకపోతే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం... స్థలాలను జప్తు చేసేందుకూ వెనుకాడం' అని మున్సిపల్ కమిషనరు టీవీ రంగారావు హెచ్చరించారు. అవసరమైతే జరిమానా కూడా విధిస్తామన్నారు. పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాలకు పన్ను విధింపుపై గురువారం ఆయన రెవెన్యూ, సచివాలయాల ఉద్యోగులతో సమీక్షించారు. ఖాళీ స్థలాలకు పన్ను చెల్లించని వారి ఇళ్ల వద్ద నోటీసులు అతికించాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శాస్త్రి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



జాబ్ కార్డు అందజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

'జాబ్‌కార్డుదారులకు వంద రోజులు పని కల్పించాలి'

కపిలేశ్వరపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలని కోరుమిల్లి సర్పంచ్ ఆచంట సత్యనారాయణ కోరారు. గురువారం కోరుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభలో డీఆర్పీ బి.శ్యామ్ వేతన సమస్యలపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. పాడి రైతులు గోకులాలను నిర్మించుకోవచ్చని సూచించారు. నూతనంగా మంజూరైన జాబ్‌కార్డులను లబ్ధిదారులకు సర్పంచ్ అందజేశారు. ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు, సీనియర్ మేట్ వింటి పళ్లంరాజు, సఖిలే సుబ్రహ్మణ్యం, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు.

నాటుసారాతో ఇద్దరు అరెస్టు

కొత్తపేట/రావులపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం ఏనుగు మహల్ గ్రామానికి చెందిన కుడుపూడి దుర్గారావును 20 లీటర్ల నాటుసారాతో, రావులపాలెం మండలం కొమరాజులంక గ్రామానికి చెందిన అత్తిలి సతీష్‌ను 40 లీటర్ల నాటుసారాతో అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు.

'భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు'

ఆత్రేయపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల భూముల సమస్యల సత్వర పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దారు రాజేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఉచ్చిలిలో నిర్వహించిన సదస్సులో పది అర్జీలు అందాయని, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అనంతరం జంగాల కాలనీలో హెల్త్ సబ్ సెంటర్‌ను తహసీల్దారు పరిశీలించారు.

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలివెలలో సర్పంచ్ సాదే లక్ష్మీశ్రీనివాస్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు వై.రాంబాబు అర్జీలు స్వీకరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు చవల జగన్నాథం, కడలి పెరుమాళ్లు, ఆర్ఐ రవిశంకర్, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరు తహసీల్దారు ఐవీ శెట్టి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై పది ఫిర్యాదులు అందాయి. వెదురుపాక, వి.సావరం, రాయవరం శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దారు చెప్పారు.

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలో తహసీల్దారు బండి మృత్యుంజయరావు ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తొలుత పుర వీధుల్లో తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించి రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కోటి లక్ష్మీనరసమ్మ-వెంకట్రావు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, ఆర్ఐ వెంకట్రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకతిప్పలో సర్పంచ్ కొరిపెల్ల నాగస్రవంతి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు పి.చిన్నారావు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ అర్జమ్మ, కార్యదర్శి పి.వెంకటేష్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



మురళీని సత్కరిస్తున్న పారిశ్రామికవేత్త శేషారావు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం

రామచంద్రపురం (ద్రాక్షారామ), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన వెంకటరమణను బులుసు కల్యాణ మండపంలో కడలి రాంపండు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ జడ్జి కోర్టు ఏర్పాటుకు మురళీ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మేడిశెట్టి శేషారావు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్లు మేడిశెట్టి సూర్యనారాయణ, కట్టా నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ, విశ్రాంత ఏఈ కడలి రామకృష్ణ, వాసంశెట్టి లక్ష్మీనారాయణ, రాయుడు చంద్రరావు, డాక్టర్ కేవీవీ సత్యనారాయణ, దంగేటి చినబాబు, ఐడీబీఐ మాజీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.

వాడపల్లిలో భక్తజన సందడి

ఆత్రేయపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. భవానీ దీక్షాపరులు కూడా విచ్చేశారు. ఓ కుటుంబం తమ ముగ్గురు పిల్లలకు తలనీలాలు సమర్పించారు. వేకువజామునే గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించారు. తిరుప్పావై, వేదపారాయణం జరిపి భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,13,127 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన డీసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్

కె.గంగవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రపోతవరం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నిడదవోలు వెంకట సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, వైస్ ఛైర్మన్ కొరిపెల్ల వెంకట సత్య శ్రీనివాసరావు గురువారం మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట కూటమి నాయకులు సలాది రమేష్, మేడిశెట్టి రవికుమార్, కొత్తపల్లి మురార్జీ, రవి వున్నారు.

రాంబాబు మృతికి సంతాపం

మండపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఐటీఐ వ్యవస్థాపకుడు వల్లూరి రాంబాబు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి పట్టణ ప్రముఖులు పలువురు సంతాపం తెలిపారు. రాంబాబు కుటుంబీకులను రెడ్డి రాధాకృష్ణ, కె.వీర్రాజు, ఎస్ఆర్ అసోసియేట్స్ యజమాని రాకుర్తి సత్యనారాయణ, పెంకే వెంకట్రావు, సాధనాల శివభగవాన్ పరామర్శించారు.



ఎరువులు, పురుగు మందుల వ్యాపారులతో సమావేశమైన ఏవో ప్రభాకర్

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

రాయవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ కొరత సృష్టించి ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన రాయవరం రైతు సేవా కేంద్రంలో ఎరువులు, పురుగు మందుల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. అనుమతి ఉన్న వాటినే విక్రయించాలని, కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ బిల్లు ఇవ్వాలని సూచించారు. రైతుకు అమ్మిన ప్రతి బస్తాను డీబీటీలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్, బిల్లుల పుస్తకాలను పరిశీలించారు. గ్రామ విస్తరణ అధికారి శివశంకర్, వ్యాపారులు పాల్గొన్నారు.